## సొసైటీలకు రూ.1.10 కోట్ల డివిడెండ్



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాస రెడ్డి

నల్లగొండ, జూన్ 23: ఉమ్మడి జిల్లాలోని 107 సొసైటీలకు త్వరలో రూ.1.10 కోట్ల డివిడెండ్ ఇవ్వనున్నట్లు డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం డీసీసీబీ కార్యాలయంలో నిర్వహించిన 104వ మహాజన సభలో ఆయన మాట్లాడారు. గతేడాదిలో సమృద్ధి, సహకార లక్ష్మి డిపాజిట్ స్కీంలు ప్రవేశపెట్టి రూ.100కోట్లు సేకరించినట్లు తెలిపారు. టీజీ క్యాబ్ నుంచి ఇతర డీసీసీబీల కంటే రూ.100కోట్లు అధికంగా తీసుకొచ్చినట్లు తెలిపారు. 2023-24కు విడుదలైన 3శాతం ఇంట్రెస్ట్ సబ్‌వెన్షన్ 54706 మంది సభ్యులకు రూ.7.91కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. బంగారు రుణాలపై వడ్డీ 7.70శాతానికి తగ్గించడం వల్ల రూ. 295.56కోట్ల రుణాలు పెరిగాయన్నారు. కర్షకమిత్ర మార్టిగేజ్ లోన్స్ ఎకరానికి రూ.2లక్షల చొప్పున గరిష్టంగా రూ.10నుంచి రూ.15లక్షలకు పెంచినట్లు తెలిపారు. సమావేశంలో సీఈవో, డైరెక్టర్లు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ దినపత్రికకు
14వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

నమస్తే తెలంగాణ దినపత్రిక
14 వసంతాలు పూర్తి చేసుకుని 15వ వసంతంలోకి అడుగుపెడుతున్న
శుభ సందర్భంగా నమస్తే తెలంగాణ దినపత్రికకు 14వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మారగోని సందీప్ గౌడ్
తండ్రి: కీర్తిశేషులు మారగోని అంజయ్య గౌడ్
సివిల్ సప్లయ్ కాంట్రాక్టర్, నల్లగొండ.



బెస్ట్ అవైలబుల్ స్కీం కింద నిధులు విడుదల చేయాలని నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

# ఉచిత విద్య మాతోని కాదు

### బెస్ట్ అవైలబుల్ స్కీం కింద బోధించలేమంటున్న పాఠశాలల యాజమాన్యాలు

### ఏడాదిన్నరగా ఏ ఒక్క పాఠశాలకూ పైసా ఇవ్వని సర్కార్

- గత బీఆర్ఎస్ సర్కార్ ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.35వేలు అందజేత
- రాష్ట్రంలో 25వేల మంది విద్యార్థులకు రూ.154కోట్ల నిధులు పెండింగ్
- ప్రత్యేక కార్యాచరణతో ఉద్యమం ప్రారంభించిన పలు సంఘాలు

నల్లగొండ, జూన్ 23: పేద విద్యార్థుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం గండికొడుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు ఈ పథకానికి నిధులు మంజూరయ్యేవి. కాగా ఏడాదిన్నరగా నిధులకు బ్రేక్ పడింది. దీంతో ప్రైవేటు పాఠశాలలు ఉచితంగా తాము విద్యను బోధించలేమని చేతులెత్తేస్తూ...డబ్బులు కడితేనే పాఠశాలల్లోకి రావాలని, ప్రభుత్వం నుంచి నిధులు వస్తే మీరే తీసుకోవాలని తేల్చిచెప్పడంతో పలు సంఘాలు ఉద్యమ కార్యాచరణను ప్రకటించి రంగంలోకి దిగాయి. బెస్ట్ అవైలబుల్ స్కీం కింద రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రైవేటు విద్యా సంస్థల్లో 19వేల మంది ఎస్సీ విద్యార్థులు, ఆరు వేల మంది ఎస్టీ విద్యార్థులు ఉచితంగా చదువుకుంటున్నారు. అయితే వారికి రెండేండ్లుగా చెల్లించాల్సిన రూ.154కోట్ల బకాయిలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించకపోవడంతో వివిధ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

#### రెండేండ్లుగా బీఏఎస్ నిధుల విడుదలకు బ్రేక్..

బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల్లో అర్హులైన, ఆసక్తి కలిగిన వారిని ఆయా సంక్షేమ శాఖల ద్వారా ఎంపిక చేసి పలు ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పించి వారు ఉచితంగా చదువుకునేలా ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 19వేల మంది ఎస్సీ, ఆరు వేల మంది ఎస్టీ విద్యార్థులకు ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉచిత విద్య అందుతుంది. అయితే ప్రతి విద్యార్థికీ రూ.35వేల మేర ప్రభుత్వం ఆయా విద్యాసంస్థలకు చెల్లిస్తుంది. బీఆర్ఎస్ సర్కార్ సైతం గత తొమ్మిదిన్నరేండ్లు ఎప్పటికప్పుడే ఈ పథకానికి నిధుల విడుదల చేసేది. అయితే కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేండ్లల్లో ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో మొత్తం రాష్ట్రంలో ఆయా విద్యా సంస్థలకు రూ.154కోట్లు విడుదల చేయాల్సి ఉంది. వీటికోసం విద్యా సంస్థల యాజమాన్యాలు పోరాటాలు చేసినా ఫలితం లేదు.

#### పోరుబాటకు పలు సంఘాల కార్యాచరణ..

బీఏఎస్ నిధులు విడుదల చేయాలని విద్యా సంస్థల యాజమాన్యాలు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పలు సంఘాలు పోరుబాటకు కార్యాచరణ ప్రకటించాయి. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభం కావటంతోపాత బిల్లులు ఇవ్వాలని లేదంటే ఉచిత విద్యాబోధన మావల్ల కాదని విద్యాసంస్థలు ప్రకటించాయి. కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచనతో తాత్కాలికంగా విరమించినా పేరెంట్స్ కమిటీలతోపాటు పలు సంఘాలు నిధుల విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

#### నిధులు విడుదల చేయాలి



కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటం వల్లనే ఈ సమస్య ఉత్పన్నమైతుంది. నల్లగొండ జిల్లాలో రూ.7కోట్ల నిధులు రావాల్సి ఉంది. ముందు డబ్బులు కట్టండి ప్రభుత్వం డబ్బులు ఇవ్వగానే మీరే తీసుకోండి.. కానీ ఉచిత విద్య మాత్రం మావల్ల కాదంటూ విద్యాసంస్థలు చెప్పటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం బీఏఎస్‌కు వెంటనే నిధులు విడుదల చేయకపోతే ఉద్యమిస్తాం.

- బొమ్మరబోయిన నాగార్జున, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

### బీఆర్ఎస్ నేతలు ప్రదీప్ రెడ్డి, వాణిశ్రీలను ఇబ్బంది పెడుతున్నారు..

### స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడి, తప్పుడు నివేదికలతో కలెక్టర్ నిర్ణయాలు

### విషయం చెప్పడానికి ప్రయత్నించినా.. పట్టించుకోవడం లేదు

### నేరుగా కలవటానికి వచ్చినా అవకాశం ఇవ్వకపోవటం సరికాదు

### నల్లగొండ కలెక్టరేట్‌లో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి


నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠితో మాట్లాడుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# అధికారులు పరిధి దాటి ప్రవర్తిస్తున్నారు..

నల్లగొండ, జూన్ 23: అధికారులు ప్రజా సమస్యలు పట్టించుకోకుండా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఏం చెబితే అదే వన్‌సైడ్‌గా అమలు చేస్తున్నారని, వారు పరిధి దాటి ప్రవర్తించడం సరికాదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. నకిరేకల్ మండలంలోని పలు సమస్యలపై ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠిని సోమవారం కలవటానికి రాగా, ఆమె తన చాంబర్‌లో నిరాకరించారు. దీంతో ఆయన నేరుగా గ్రీవెన్స్ హాల్‌లోకి వెళ్లి కలెక్టర్‌పై అసహనం వ్యక్తం చేశారు. నకిరేకల్ శాసన సభ్యుడిగా రెండుసార్లు ఎన్నికయ్యానని, నిత్యం ప్రజలతో సంబంధాలు ఉన్న తాను సమస్యలపై విన్నవించడానికి


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

26సార్లు ఫోన్ చేస్తే సమాధానం ఇవ్వకపోవడం సరికాదని అనటంతో పోలీసులు ఆయనను హాల్ నుంచి బయటకు పంపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కలెక్టర్‌కు నకిరేకల్ సమస్యలు విన్నవించటానికి 26సార్లు ఫోన్ చేసినా ఎత్తి సమాధానం ఇవ్వకపోవటం వల్లనే నేరుగా వచ్చానని, అయినా రెస్పాండ్ కాకపోవటం ఎంటని ప్రశ్నించారు. నకిరేకల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్ రెడ్డి, చిన్నకాపర్తి మాజీ సర్పంచ్ వాణిశ్రీనుల అర్జీలను కలెక్టర్ పట్టించుకోకుండా దాటవేస్తూ..స్థానిక ఎమ్మెల్యే వత్తిడితో వారిని రాజకీయంగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. అధికార పార్టీ నేతల అండదండలతో కొందరు అధికారులు తప్పుడు నివేదికలు క్రియేట్ చేసి, ఇటీవల కేతెపల్లి పంచాయతీ కార్యదర్శిపై వేటు వేశారన్నారు. బీఆర్ఎస్ నేతలను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ నేతలు అధికారుల అండదండలతో చిన్నకాపర్తి మాజీ సర్పంచ్ వ్యవసాయ క్షేత్రంలో భవనాలను నేలమట్టం చేయించినట్లు తెలిపారు. అధికారులు ఎమ్మెల్యేల తొత్తులుగా మారి బీఆర్ఎస్ నేతలను ఇబ్బందులు పెట్టడం సరికాదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పెద్ద హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు ఇవ్వాల కాంగ్రెసోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. అధికారుల దగ్గర పవర్ లేకుండా పోయిందని మొత్తం పవర్‌ను కాంగ్రెస్ నేతలే తీసుకొని నిడిపిస్తున్నారన్న చిరుమర్తి కలెక్టరేట్ దగ్గర ఉన్న బాధితులను చూస్తే రాష్ట్రంలో రేవంత్ పాలన ఎట్లా ఉందో అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని..పైరవీలు, లంచాలతో నాయకులు, అధికారులు పబ్బం గడుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని..అధికారులు పరిధి దాటి పనిచేస్తే సహించమని హెచ్చరించారు.

# లక్కీ డ్రా పేరిట ఘరానా మోసం

- రూ.4 కోట్లతో ఉడాయించిన నిర్వాహకులు

మిర్యాలగూడ, జూన్ 23: లక్కీ డ్రీం స్కీం పేరిట బడుగు జీవులను బురిడి కొట్టించారు. నెలకు రూ.1000 చెల్లించి చేరితే డ్రాలో బహుమతులు గెలుచుకోవచ్చున్న మాయమాటలతో అమాయక ప్రజలను నమ్మించి శఠగోపం పెట్టారు. ఈ ఘటన పట్టణంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు, వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్కే ఎంటర్‌ప్రైజెస్ పేరిట రమేశ్, బచ్చలకూరి శ్రీనివాస్, కోటేశ్వర్‌రావు స్కీం ప్రారంభించారు. వ్యాపారాన్ని విస్తృతం చేసుకునేందుకు ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాలతోపాటు ఏపీ సరిహద్దు గ్రామాల్లో ఏజెంట్లను చేర్చుకొని ఒక్కో సభ్యుడి నుంచి నెలకు రూ.1000 చొప్పున వసూలు చేశారు. 15 నెలలపాటు రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. మొత్తం 2,600 మంది సభ్యులను చేర్చుకొని ప్రతినెలా డ్రా తీసి పది మందికి రూ.15వేల విలువైన వస్తువులు అందచేస్తూ వచ్చారు. గతేడాది అక్టోబర్‌లో ప్రారంభమైన లక్కీ డ్రా స్కీం ఈ ఏడాది జనవరిలో ముగిసింది.ఇప్పటివరకు 150 మందికి చెల్లింపులు జరిపిన నిర్వాహకులు ఆ తరువాత ఎత్తివేశారు. దీంతో సభ్యులుగా చేర్పించిన ఏజెంట్లను నిలదీయడంతో అసలు విషయం బయటపడి పోలీసులను ఆశ్రయించారు. చైన్ పద్ధతిలో నడిచే ఈ స్కీంలో సుమారు రూ.4కోట్ల వరకు వసూలు చేశారు. చెల్లింపులు జరపకపోవడం, బంపర్ డ్రా తీయకపోవడంతో అనుమానించిన వెంకటమ్మ ఏజెంట్లు మందారి మల్లేశ్వరి, నిర్వాహకుడు రమేశ్‌పై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న మిగతా బాధితులు సైతం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వేడుకున్నారు. ఒక్క మిర్యాలగూడలోనే సుమారు 900 మంది బాధితులు బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిర్వాహకుల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ మోతీరాం తెలిపారు.


మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

# తండ్రి నేత్రాలతో మరొకరికి వెలుగు

రామగిరి, జూన్ 23: నల్లగొండలోని గౌతమి జూనియర్ కళాశాల డైరెక్టర్ పుట్టా వెంకటరమణారెడ్డి తండ్రి పుట్టా దశరథిరెడ్డి (80) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతి చెందినప్పటికీ ఇతరులకు వెలుగునివ్వాలనే సంకల్పంతో కుటుంబసభ్యులు, బంధుమిత్రుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్టుకు నేత్రదానం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ చైర్మన్ కేవీప్రసాద్, కోఆర్డినేటర్ చిరునోముల చంద్రశేఖర్, ఐ డోనేషన్ సెంటర్ మేనేజర్ డా.ఏసీహెచ్ పుల్లారావు మాట్లాడుతూ..ఇది 139వ నేత్రదానమని, సేకరించిన నేత్రలతో 278 కార్నియా అను కంటి పొరల ద్వారా 278 మంది కార్నియాల అంధులకు కంటిచూపు అందించినట్లు తెలిపారు. అనంతరం వెంకటరమణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ డా.అల్వాల రవి, ఐఎంఏ అధ్యక్షుడు డా.దామేర యాదయ్య, కార్యదర్శి డా.ప్రవీణ్, కోశాధికారి డా.కొనకంచి విజయ్‌కుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి ఉన్నారు.


తండ్రి నేత్రాలను దానం చేస్తున్న పుట్టా దంపతులు


అంభ భవాని లిఫ్టు పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## లిఫ్టు పనుల పరిశీలన

చందంపేట, జూన్ 23: నేరెడుగొమ్ము మండలంలోని చిన్నమునిగల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న అంభ భవాని లిఫ్టు ఇరిగేషన్ పనులను నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంభ భవాని లిఫ్టు పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో రైతులకు సాగుకు ఢోకా ఉండదన్నారు. లిఫ్టు పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం చందంపేట మండలంలోని కంబాలపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు, యాపలపాయ తండాలో ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో అందిస్తున్న మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో హాజరుశాతం పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం చందంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ వైద్యులు అందుబాటులో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్లు శ్రీధర్‌బాబు, ఉమాదేవి, ఎంపీడీవో లక్ష్మి, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మధు, ఈఈ యలమందయ్య, డీఈ ప్రభాకర్, ఏఈ శివరాజ్, అనిల్, ఆర్ఐ అలీమ్, వైద్య సిబ్బంది ఉన్నారు.


నల్లగొండ జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో మొక్క నాటుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, జూన్ 23: యువత మత్తు పదార్థాలకు బానిసలై, భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని, మాదక ద్రవ్యాల రహిత సమాజంగా నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ యాంటీ డ్రగ్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆదిత్య పాఠశాల విద్యార్థులతో కలిసి ఆయన జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో మొక్కలు నాటి మాదక ద్రవ్యాలు వినియోగ వల్ల కలిగే అనారోగ్య ప్రభావాలు, ఆర్థిక, సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలు లాంటి చెడు వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష సాధన దిశగా అడుగులు వేయాలని సూచించారు. మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్ వంటివి తీసుకుంటే ఆరోగ్యంపై పడే హానికర ప్రభావాలతోపాటు ఆర్థిక నష్టాలు, సమాజంలో గుర్తిం పు గౌరవం ఉండదని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లయితే సమాచారం అందించాలన్నారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో మిషన్ పరివర్తన్ మాదక ద్రవ్యాల సమాజ నిర్మూలనే లక్ష్యంగా ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించి డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా ప్రతిఒక్కరూ సైనికుల వలె పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేశ్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, ఆర్ఐలు సంతోష్, హరిబాబు, ఎస్ఐలు సైదులు, సైదాబాబు, శంకర్, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

#### వృత్తి నైపుణ్యాలపై డ్యూటీ మీట్

కేసుల దర్యాప్తు, పోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, నేర పరిశోధన, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ టీం లాంటి అంశాలపై జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి వృత్తి నైపుణ్యాలపై జిల్లాస్థాయి డ్యూటీ మీట్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ప్రారంభించి మాట్లాడుతూ..పోలీసులు విధి నిర్వహణలో కేసుల దర్యాప్తు, నేర పరిశోధనలో వృత్తి నైపుణ్యాలు ఎంతగానో దోహదపడనున్నందున వాటిపై మరిన్ని మెళకువలు పెంపొందించుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించే కేసుల దర్యాప్తు, పోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, నేర పరిశోధనలో ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీ, డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ టీం లాంటి అంశాల్లో పట్టు సాధించి జిల్లాస్థాయి నుంచి జాతీయస్థాయిలో ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేశ్ ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఎస్ఐలు శ్రీను, సంతోష్ ఆర్ఎస్ఐ కల్యాణ్ రాజ్, సాయిరామ్, సిబ్బంది ఉన్నారు.

## హరితహారం చెట్లు నరికివేత


రాళ్లవాగుతండా వద్ద నరికివేసిన చెట్లు

దామరచర్ల, జూన్ 23: హరితహారం కింద నాటిన చెట్లను నరికివేస్తున్నారు. మండలంలోని వాడపల్లి నుంచి మిర్యాలగూడ వరకు నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధాన రహదారికి ఇరువైపులా బీఆర్ఎస్ ప్రభుత్వంలో హరితహారం కింద మొక్కలు నాటారు. అవి నేడు చెట్లుగా మారి ప్రయాణికులకు నీడను అందిస్తున్న క్రమంలో విద్యుత్ లైన్లకు అడ్డుగా వస్తున్నాయని ఇష్టారాజ్యంగా ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేస్తున్నారు. రహదారి వెంట కొత్తగా విద్యుత్ స్థంభాలు వేయడంతో వాటికి అడ్డుగా ఉన్నాయనే నెపంతో చెట్లను నరికి వేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చెట్లను నాటి సంబంధిత గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో సంరక్షణ చేపట్టింది. రోడ్డుకు ఇరువైపులా పచ్చదనంతో మంచి వాతావరణాన్ని కల్పిస్తున్న చెట్లను నరికి వేయడంతో గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.